RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

తెలుగు దినపత్రిక

30-03-2026

సోమవారం, హైదరాబాద్

సంపుటి: 03 I సంచిక: 361

పేజీలు: 04 I వెల: 5/-

ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:

https://epaper.deekshaprabhadaily.com



2

## సౌదీలో అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్ దాడి



## కన్నవారికి అండగా ఉండేందుకు
# కొత్త చట్టం



- 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు ఆమోదం
- తెలంగాణ ఉద్యోగుల జవాబుదారీతనం, పర్యవేక్షణ బిల్లు-2026 ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఇలాంటి చట్టం తీసుకొచ్చామని వెల్లడి
- సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారని ఆవేదన
- గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి సమీక్ష
- భక్తులకు ఏ చిన్న సమస్యా రాకుండా చూసుకోవాలని ఆదేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన కేంద్ర మాజీ మంత్రి మేనకాగాంధీ
- జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కితాబు

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** రాష్ట్రంలోని వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ వ్యవస్థల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పెద్దలను నిర్లక్ష్యం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం "తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లు"ను రూపొందించింది. ఈ బిల్లును శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. తల్లిదండ్రుల సంరక్షణ మిగతా2లో...

## ఎంఎస్ఎంఈలకు మరో రిలీఫ్
# ప్యాకేజ్ సిద్ధం!

### ద్రవ్యోల్బణ నియంత్రణకు కేంద్రం కొత్త చర్యలు

### ఇంధనంపై ఎక్సైజ్ తగ్గింపుతో వినియోగదారులకు ఊరట

### ఎగుమతిదారులకు రిలీఫ్, ఆర్వో డీటీఈపీ పునరుద్ధరణ



**నేషనల్ డెస్క్, దీక్షప్రభ:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావంతో దేశ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం మరిన్ని ఉపశమన ప్యాకేజీలను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ రంగం, బలహీన వర్గాలపై ప్రభావం తగ్గించేందుకు లక్ష్యంగా చర్యలు తీసుకునే దిశగా ఆలోచనలు జరుగుతున్నాయి. ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ఇప్పటికే కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించింది. పెట్రోల్‌పై లీటరుకు 3 రూపాయల వరకు తగ్గింపు చేయగా, డీజిల్‌పై ఎక్సైజ్ మినహాయింపు ఇచ్చి వినియోగదారులకు ఊరట కల్పించింది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావాన్ని తగ్గించడమే దీని ఉద్దేశ్యం.

**సరఫరా అంతరాయం.. ఖర్చుల పెరుగుదల**

అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్యలతో ప్రారంభమైన ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఒక దశలో బ్యారెల్ ధర 119 డాలర్లకు మిగతా2లో...

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక ప్రదర్శనలు

### ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
### హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు



2

## డీఎంకే వరాల జల్లు

### మహిళలకు నెలకు రూ.2 వేలు

- టీవీ, ఫ్రిజ్ కొనుక్కునేందుకు మరో రూ.8వేలు !
- ఎన్నికల తాయిలాలు ప్రకటించిన తమిళనాడు సీఎం స్టాలిన్
- రైతులకు ఉచితంగా పంపుసెట్లు ఇస్తామని డీఎంకే ప్రకటన

**నేషనల్ డెస్క్, దీక్షప్రభ:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు ప్రజలకు అధికార డీఎంకే పార్టీ వరాల జల్లు కురిపించింది. తమిళనాడులో మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు మిగతా2లో...



## విచారణకు రెడీ

- రేవంత్ తమ్ముళ్లు, బావలు చేసిన స్కాంలపైనా విచారణ జరపాలి
- దళితులపై రాజకీయం చేస్తున్నారు
- ముఖ్యమంత్రిది కపట ప్రేమ, మొసలి కన్నీరు
- పొంగులేటి విషయం బయటపడగానే నాపై బురద ..
- చెంచా గాళ్లతో నన్ను తిట్టించడం సరికాదు
- సీబీ సీఐడీ రేవంత్ రెడ్డి జేబు సంస్థ
- మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు



2




## అసెంబ్లీ సాక్షిగా సీఎం అబద్ధాలు

- సిగ్గులేకుండా రేవంత్ రెడ్డి తప్పుడు లెక్కలు
- రూ.15 వేల కోట్ల అప్పును బలవంతంగా రుద్దుతున్నారు
- మెట్రో ఎల్‌అండ్‌టీ వద్ద ఉంటే కేంద్రం ఎందుకు అభ్యంతరం చెబుతుంది?
- మెట్రో టేకవర్‌లో చిత్తశుద్ధి ఉంటే వెంటనే విచారణ జరిపించాలి
- లేకపోతే గవర్నర్‌కు ఫిర్యాదు
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:**

మెట్రో టేకోవర్‌పై అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి సిగ్గులేకుండా తప్పుడు లెక్కలు చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌అండ్‌టీ అనే ప్రైవేటు కంపెనీకి ఉన్న రూ.15 వేల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోందని అన్నారు. మంత్రి అక్రమ మైనింగ్ కంపెనీపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలంటూ గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన తెలిపారు. ఈ నిరసనలో కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 280 ఎకరాల మిగతా2లో...

## రెండు స్థానాల్లో నుంచి విజయ్ పోటీ

- పెరంబూర్, త్రిచీ ఈస్ట్ నుంచి బరిలోకి
- తొలి ఎన్నికల పరీక్షలో విజయ్ పార్టీ
- సామాన్యులకు టికెట్లు ఇచ్చామన్న విజయ్
- అధికార పార్టీకే నేరుగా సవాల్
- హామీలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం



2

## బెంగాల్‌లో కాంగ్రెస్
# బిగ్ బ్యాంగ్

- ఒకేసారి 284 మంది అభ్యర్థుల జాబితా విడుదల!
- అధీర్ రంజన్ చౌధురి బహరంపూర్ నుంచి బరిలో
- మౌసమ్ నూర్‌కు మాలతిపూర్ టికెట్
- మొత్తం 294 స్థానాల్లో ఒంటరిగా పోటీకి సిద్ధం
- సీఈసీ సమావేశం తర్వాత కీలక నిర్ణయం



2



# క్షమించండి
## న్యాయం చేయలేకపోయా..

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి రెండు రోజుల సమయమిస్తున్నామని ఈ లోగా మిగతా2లో...

- బీఆర్ఎస్ హయాంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం
- ఆనాటి ప్రభుత్వ పాపంలో నాకు భాగం
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- ఏజెన్సీలకు కొమ్ముకాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల మందికి అన్యాయం
- కోదండరాం, హరగోపాల్ లాంటి మేధావుల మౌనం ఉద్యోగులకు శాపం
- ఇందిరా పార్క్ వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాలో కల్వకుంట్ల కవిత

# విచారణకు రెడీ

తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ: రాష్ట్ర ప్రజలకు ఒకటి స్పష్టంగా అర్థమైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్ పాల్పడ్డారని.. ఇదే విషయం ఈరోజు టీవీల్లో చూసిన ప్రజలతో పాటూగా రేవంత్ రెడ్డికి ఇంకా అర్థమైంది. స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు రాఘవ కన్స్ట్రక్షన్స్ అవినీతికి పాల్పడిందని.. అందుకే ప్రభుత్వం డిఫెన్స్ లో పడిపోయి, రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేశాడని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. అక్రమ మైనింగ్ పై మాకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వకుండా, వాళ్లకు వాళ్లే సీబీ సీఐడీ విచారణ అంటూ చెప్పుకొని వస్తున్నారు. అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తే, దళితులపై రాజకీయం చేశారు. ప్రభుత్వ అవినీతిని కౌశిక్ రెడ్డి గట్టిగా ప్రశ్నిస్తున్నాడు కాబట్టే కౌశిక్ రెడ్డిపై ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వం దాడి చేస్తుంది. ఈ దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా భావిస్తున్నాం. బదువ అనే భాష మాట్లాడిన రేవంత్ రెడ్డిపై శాసన సభ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాం. ఈరోజు కుట్రలో భాగంగా కౌశిక్ రెడ్డిపై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేశారన్నారు. దళితులపై ప్రేమ ఉన్న బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు దళిత గిరిజనుల గురించి ఆలోచించి కేసీఆర్ దళిత బంధు పథకం తెచ్చారని హరీష్ రావు అన్నారు. ఒక్క ఏడాదికి కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల కోసం రూ.1395 కోట్లు కేటాయిస్తే బిఆర్ఎస్ హయంలో ఒక్క ఏడాదికి దళితుల సంక్షేమం కోసం రూ.7,365 కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ కు దళితుల పై ప్రేమ మాటల్లో ఉంటే, మాకు చేతల్లో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలో SC కార్పొరేషన్ కు రూ.3,267 కోట్లు కేటాయించి, 28 కోట్లు ఖర్చు చేశారు. దళితుల పై రేవంత్ రెడ్డిది కపట ప్రేమ, మొసలి కన్నీరు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతికి పాల్పడింది అని స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు. మంత్రి తప్పు చేస్తే విచారణ న్యాయంగా జరుగుతుందా. అందుకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బర్తరఫ్ చెయ్యాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాపాడే ప్రయత్నంలో భాగంగా విచారణ వేశారన్నారు. మరో వంద అబద్ధాలు ప్రభుత్వం బయట పెట్టుకున్న ప్రభుత్వం.. పార్లమెంట్ లో జాయింట్ హౌస్ కమిటీ వెయ్యాలని అనేకసార్లు పార్లమెంట్ లో రాహుల్ గాంధీ మాట్లాడారు. రాహుల్ గాంధీ మాట్లాడితే తప్పు లేదుగాని, మేం హౌస్ కమిటీ డిమాండ్ చేస్తే తప్పా. ఓబులాపురం మైనింగ్ పై హౌస్ కమిటీ వేశారు కదా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేస్తే తప్పేంటి. అక్రమ మైనింగ్ అని మైనింగ్ వారే రెండు సార్లు 28 లక్షలు ఫైన్ వేశారు. ఫైన్ కట్టారా లేదా ఆధారాలు చూయించండని అడిగారు. మంత్రిపై యాక్షన్ తీసుకోలేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాపాడబోయి.. మరో వంద అబద్ధాలు ప్రభుత్వం బయట పెట్టుకుంది. మీటర్లు దొరకడం లేదని, డీజిల్ జనరేటర్లు ఇచ్చామని మైనింగ్ మంత్రి అంటున్నారు. సబ్‌మిట్ చేసిన వారికి మీటర్ల అనుమతి ఇచ్చినప్పుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కంపెనీకి డీజిల్ జనరేటర్ ఎలా ఇచ్చారు. దీన్ని బట్టి చూస్తే మంత్రి సబ్‌మిట్ చెయ్యలేదని అర్థమవుతుంది. అందుకే అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకోవాలని మేం డిమాండ్ చేశాం. అక్రమ మైనింగ్‌లో వందల కోట్ల రూపాయలు రాష్ట్ర ఖజానాకు నష్టం జరిగింది. పరిశ్రమల శాఖలో భాగంగా మైనింగ్ ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ కు తెలియక పోవడం శోచనీయమన్నారు హరీష్ రావు. అక్రమ మైనింగ్ జరుగుతుందని రాఘవ కన్స్ట్రక్షన్స్ పై అనేక సార్లు ఎల్లో ఫ్లాగ్ శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విషయం బయటపడగానే నాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. నా బావమరిది, నా తమ్ముడు పేర్లు తీసుకుంటూ మాపై ఆరోపణలు చేశారు. మా కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలపై విచారణకు సిద్ధం. రేవంత్ రెడ్డి తమ్ముళ్ళ, బావల కోసం కుంభకోణాలపై విచారణకు రెడీ అయితే నేను రెడీ. సీబీ సీఐడీ విచారణ కాదు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం, నేను సిద్ధంగా ఉన్నాను, రేవంత్ రెడ్డి సిద్ధమా..? రెండు గుల్లాలో నన్ను తిట్టించడం కాదు, రేవంత్ రెడ్డి. నా స్వంత ప్రయోజనాల కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి నేను ఫోన్ చెయ్యలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక కుంభకోణాలు జరిగాయని నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈరోజు లేఖ రాశామని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 20 కుంభకోణాలు జరిగాయి. దమ్ముంటే వీటిపై విచారణ చేయ్. రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి చేసిన కుంభకోణాల పై విచారణ చేసేదాక బీఆర్ఎస్ వదిలిపెట్టదని హెచ్చరించారు. రాష్ట్రంలో భూముల సెటిల్ మెంట్ లో రేవంత్ రెడ్డికి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మధ్య వాటా బంధాలు ఉన్నాయి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై హౌస్ కమిటీ వేసే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదు. కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారు. సెటిల్ మెంట్ అయితే క్లియర్ చేస్తున్నారు. లేకపోతే బెదిరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కుంభకోణం ఆధారాలతో సహా తొందరలోనే బయట పెడుతాను కొడంగల్, నారాయణ పేట లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికే ఇచ్చారు. మూసీ సుందరీకరణ టెండర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికే ఇస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బంధం ఫెవికల్ బంధం. రాజేంద్ర నగర్ మానస హిల్స్ ఇష్టానుసారంగా వందల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఇంతటి అవినీతికి పాల్పడిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే రాజీనామా చెయ్యాలి, లేదంటే బర్తరఫ్ చెయ్యాలి. సీబీ సీఐడీ రేవంత్ రెడ్డి జేబు సంస్థ అని ఆరోపించారు.

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక ప్రదర్శనలు

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** తెలంగాణ శాసనమండలి, శాసనసభ్యుల సాంస్కృతిక ప్రదర్శనలు హైదరాబాద్‌లో ఉత్సాహంగా కొనసాగాయి. ఆదివారం సాయంత్రం రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన ఈ సాంస్కృతిక ప్రదర్శనలను సీఎం రేవంత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తెలంగాణ లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. ధుర్యోధనుడి పాత్రపై ఏకపాత్రాభినయం మంత్రి వాకిటి శ్రీహరి చేశారు. గద్దర్ వేషధారణలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఉద్యమ పాటలు పాడారు. కట్టప్ప పాత్రలో నటించి ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మెప్పించారు. కోయదొర పాత్రలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నటించి మెప్పించారు. బంజారా ఆడబిడ్డలతో కలిసి సేవాలాల్ పాటకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నృత్యం చేశారు. అదేవిధంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సీనియర్ ఎన్‌టీఆర్, శోభన్ బాబు పాత్రలతో అలరించారు. తెలంగాణ శాసనసభ, మండలి సభ్యుల కోసం ఈ నెల 28, 29 తేదీల్లో లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్ 2026 కార్యక్రమం చేపట్టింది ప్రభుత్వం. అందులో భాగంగా శనివారం ఎల్బీ స్టేడియంలో క్రీడాపోటీలు నిర్వహించగా.. నేడు రవీంద్రభారతిలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. 12 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ పోటీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇక శనివారం ఎల్బీ స్టేడియంలో జరిగిన క్రీడాపోటీలను ఛైర్మన్ జూపల్లి కృష్ణారావు ప్రారంభించిన సంగతి తెలిసిందే.

## ఎంఎస్‌ఎంఈలకు మరో రిలీఫ్ ప్యాకేజ్ సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)
చేరగా, ప్రస్తుతం 100 డాలర్ల వద్ద స్థిరపడింది. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. అందులో ఎక్కువ భాగం హోర్ముజ్ జలసంధి ద్వారా వస్తోంది. అక్కడ భద్రతా సమస్యలు పెరగడంతో నౌకల మార్గాలు మారడం, ట్రాన్స్‌షిప్‌మెంట్ కేంద్రాల్లో రద్దీ పెరగడం, బీమా ప్రీమియాలు పెరగడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో లాజిస్టిక్స్ ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎగుమతిదారులకు ప్రత్యేక మద్దతు చర్యలు తీసుకుంది. రిలీఫ్ పథకం కింద 497 కోట్ల రూపాయలతో లాజిస్టిక్స్, బీమా ఖర్చుల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. అలాగే ఆర్వో డీటీఈపీ పథకం కింద ఉన్న పూర్తి ప్రయోజనాలను తిరిగి అమలు చేసింది. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 31 వరకు ఈ ప్రయోజనాలు అమల్లో ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది. ఇక డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై మళ్లీ సుంకాలు విధించి దేశీయంగా సరఫరా పెంచే ప్రయత్నం చేసింది. ఎగుమతి రంగంలో ఆర్డర్ రద్దులను తగ్గించడం, ఉపాధి కాపాడడం కూడా ఈ చర్యల ప్రధాన లక్ష్యం. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణ ఉపశమన చర్యలతో పాటు దీర్ఘకాల వ్యూహాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఇంధనం మాత్రమే కాకుండా ఇతర కీలక వస్తువుల నిల్వలు పెంచడం అవసరమని సూచిస్తున్నారు. మధ్యప్రాచ్య సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు విసురుతున్నప్పటికీ, బలమైన దేశీయ డిమాండ్, స్థిరమైన మాక్రో ఆర్థిక పరిస్థితులు ప్రభావాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## డీఎంకే వరాల జల్లు

(మొదటి పేజీ తరువాయి)
అందుతున్న నెలవారీ గౌరవ వేతనాన్ని వెయ్యి రూపాయల నుంచి 2 వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం స్టాలిన్ విడుదల చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులే లక్ష్యంగా పలు పథకాలను ప్రకటించిన స్టాలిన్, ఇల్లత్తరసి పథకం కింద ప్రతి గృహిణికి 8 వేల రూపాయల విలువైన కూపన్లను అందజేస్తామని స్టాలిన్ తెలిపారు. ఈ కూపన్లను ఉపయోగించి మహిళలు తమకు టీవీ, మిక్సీ, గ్రైండర్ వంటి వస్తువులను కొనుగోలు చేయవచ్చని వెల్లడించారు. అదే కూపన్లతో పాత వస్తువులను మార్చుకోవచ్చని స్టాలిన్ స్పష్టం చేశారు పాఠశాలల్లో అమలవుతున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని 8వ తరగతి వరకు విస్తరిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఉచిత విద్యుత్ పథకం కింద రైతులకు ఎలాంటి మీటర్లు లేని ఆధునిక పంపు సెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త ఇళ్లను నిర్మించి పేదవాళ్లకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినులకు ఇచ్చే నెలవారీ ప్రోత్సాహకాన్ని వెయ్యి రూపాయల నుంచి 15 వందల రూపాయలకు పెంచుతామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆరోగ్య బీమా పథకం కింద వార్షిక ఆదాయ పరిమితిని 5 లక్షలకు పెంచి వైద్య బీమా మొత్తాన్ని 10 లక్షల రూపాయలకు పెంచుతామని స్టాలిన్ వెల్లడించారు. వరి మద్దతు ధర క్వింటాలుకు 3 వేల 500 రూపాయలు, చెరకు మద్దతు ధర టన్నుకు 4 వేల 500 రూపాయలకు పెంచుతామని స్టాలిన్ స్పష్టం చేశారు. వృద్ధులకు ఇచ్చే నెలవారి పింఛను 2 వేల రూపాయలకు పెంచుతామని స్టాలిన్ స్పష్టం చేశారు.

# క్షమించండి

(మొదటి పేజీ తరువాయి)


ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపకుంటే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నాచౌక్ లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నిర్వహించిన ధర్నాకు ఆమె మద్దతు తెలిపి ప్రసంగించారు. తెలంగాణ వస్తే అసలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల వ్యవస్థే ఉండదని భావించామని.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పర్మినెంట్ ఉద్యోగాలనే ఔట్ సోర్సింగ్‌గా మార్చేశారని ఆవేదవ వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు విద్యుత్ ఆర్టిజన్లకు భరోసా కల్పించగలిగానని, మరికొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేశానని తెలిపారు. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.ఆనాటి పాపంలో తనకు భాగం ఉన్నందుకు సోదరిగా క్షమాపణ చెప్తున్నానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోలేదనే కాంగ్రెస్ ను గెలిపిస్తే వాళ్లు కూడా పట్టించుకోవడం లేదన్నారు. ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్ లాంటి వాళ్లు చెబితేనే తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మద్దతు పలికారని చెప్పారు. ఇవ్వాళ కోదండరాం, హరగోపాల్ లాంటి మేధావుల మౌనం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 5 లక్షల మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ఈ ఉద్యమం మరో తెలంగాణ ఉద్యమంలా ఉందని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఏ విధంగా చేశామో.. అలాగే హాఫ్ మిలియన్ ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హైదరాబాద్ వీధుల్లో మార్చ్ చేపట్టాలని పిలుపునిచ్చారు. అప్పుడు మాత్రమే ఈ ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం కారణంగా 9 వందల ఏజెన్సీలకు మాత్రమే లాభం కలుగుతుంది తప్ప ఉద్యోగులకు జరిగిన మేలు ఏది లేదన్నారు. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్లుగా ప్రభుత్వాలు ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను ఏజెన్సీలకు దోచి పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం పై రూపాయి భారం పడకుండా సమస్య పరిష్కారించే అవకాశం ఉన్న ఏజెన్సీలకు ఎందుకు కొమ్ము కాస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ధర్నా చౌక్ ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్ని రోజులైనా ధర్నా చేసుకొని మీ చావు మీరు చావండన్నట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమస్యపై పోరాటం మాత్రమే కాదు పరిష్కారమయ్యే వరకు కొట్లాడటం తెలంగాణ బిడ్డల లక్షణమని చెప్పారు. ఖమ్మం వెలుగుమట్ల బాధితుల విషయంలో తాను, విశారదన్ మహారాజ్ అన్నం ముట్టకుండా దీక్ష చేశామని గుర్తు చేశారు. అప్పుడే బాధితులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని అన్నారు. అది శాంపిల్ మాత్రమేనని భవిష్యత్ లోనూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఇలాగే పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. తాము త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరించబోతున్నామని తెలిపారు. ఈ లోపే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నామని అన్నారు. లేదంటే ఇంకా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం ఇప్పటికీ కొనసాగటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జాగృతి అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే విధానాన్నే లేకుండా చేస్తామన్నారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థ మాత్రమే ఉండాలన్నది తమ విధానమని స్పష్టం చేశారు.

## అసెంబ్లీ సాక్షిగా సీఎం అబద్ధాలు

(మొదటి పేజీ తరువాయి)
ప్రభుత్వ భూమిని గత వైఎస్ఆర్ ప్రభుత్వం మెట్రోకు కేవలం లీజుకు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఎల్అండ్‌టీ వద్ద ఉన్న భూములు కొన్నామని రేవంత్ చెబుతున్నారని పేర్కొన్నారు. అవి ఎల్అండ్‌టీకి లీజుకు ఇచ్చిన భూములే.. తప్ప వారికి అమ్మలేదని తెలిపారు. ఆ భూములు ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. లీజుకు ఇచ్చిన భూములు కొనేశామని రేవంత్ గప్పాలు చెబుతున్నారని మండిపడ్డారు. 280 ఎకరాలు కాజేయాలని దండుపాళ్యం బ్యాచ్ చూస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. మెట్రో ఎల్అండ్‌టీ వద్ద ఉంటే కేంద్రం ఎందుకు అభ్యంతరం చెబుతుందని ప్రశ్నించారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం ఫండింగ్ ఎందుకు ఇచ్చిందని అడిగారు. దీనిపై ముఖ్యమంత్రి కాకమ్మ కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. మెట్రో ప్రాజెక్టుపై ప్రకటన కాంగ్రెస్ సర్కార్ తప్పుడు నిర్ణయమని కేటీఆర్ అన్నారు. వేల కోట్ల సంపదను దోచుకోవడానికి, ఎల్అండ్‌టీ కంపెనీ సీఎఫ్‌వోను జైలులో వేస్తామని బెదిరించారని కేటీఆర్ అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో తాను చెప్పిన మాట వినడం లేదని కాంగ్రెస్ గూండాలు బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారని విమర్శించారు. ఎల్అండ్‌టీ కంపెనీకి లీజుకిచ్చిన రూ.22 వేల కోట్ల విలువైన 280 ఎకరాల భూమిని కొట్టేయడానికి కాంగ్రెస్ దండుపాళ్యం బ్యాచ్ కుట్రకు తెరలేపిందని అన్నారు. ఈ భూ దందాకు, దండుపాళ్యం ముఠాకు సీఎం రేవంత్ రెడ్డి నాయకుడు అని ఆరోపించారు. మెట్రో టేకోవర్‌లో హైదరాబాద్ ప్రయోజనాలు, మెట్రో ప్రయోజనాలు లేవని తెలిపారు.

## రెండు స్థానాల్లో నుంచి విజయ్ పోటీ

**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపుతూ నటుడురాజకీయ నాయకుడు విజయ్ తన పార్టీ తమిళంగా వెట్రీకజగం తరఫున రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. పెరంబూర్, త్రిచీ ఈస్ట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగుతున్నట్లు వెల్లడిస్తూ ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ గుర్తు 'విజిల్'ను ప్రధానంగా ప్రచారం చేస్తూ "ఇది విజిల్ విప్లవం ఎన్నిక" అని వ్యాఖ్యానించారు. తనతో పాటు పార్టీ అభ్యర్థులందరినీ ఒకటిగా చూడాలని, వ్యక్తిగతంగా కాకుండా పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మొత్తం రెండువందల ముప్పై నాలుగు నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అధికారంలో ఉన్న డీఎంకే ముందున్న ఎన్నిక ఈసారి కఠినంగా మారనుంది. ఒకవైపు ఏఐడీఎంకే, బీజేపీ కూటమి తిరిగి పుంజుకోవాలని చూస్తుండగా, విజయ్ నేతృత్వంలోని పార్టీ తొలి ఎన్నికల్లోనే ప్రభావం చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు పీఎంకే ఆధ్వర్యంలోని కూటమి, అలాగే నామ్‌తమిళర్ కాచి.. ఒంటరిగానే పోటీలో ఉండడంతో పోరు బహుముఖంగా మారింది. విజయ్ పోటీ చేస్తున్న రెండు స్థానాలు ప్రస్తుతం అధికార పార్టీ ఆధీనంలోనే ఉన్నాయి. పెరంబూర్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న ఆర్‌డీ శేఖర్, త్రిచీ ఈస్ట్‌లో ఇనిగో ఎస్ ఇరుదయరాజ్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యక్షంగా అధికార పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తమ అభ్యర్థులు సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారేనని, అవినీతి, అక్రమ మైనింగ్, జర్నలిస్టులపై దాడుల వంటి ఆరోపణలు లేని వారేనని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నేతలను ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇది కేవలం అభ్యర్థుల ప్రకటన కాదని, ప్రజల రక్షకుల ఎంపిక అని విజయ్ పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థుల ఎంపికలో తానే ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నానని తెలిపారు. ఈ ఎన్నిక ప్రజల కూటమి మరియు ముఖ్యమంత్రి ఎంకే. స్టాలిన్ నేతృత్వంలోని కూటమి మధ్య పోరుగా మారుతుందని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచారంలో విజయ్ పలు హామీలు ప్రకటించారు. రాష్ట్రాన్ని మత్తు పదార్థాల రహితంగా మార్చుతామని తెలిపారు. ఉద్యోగం లేని వారికి నిర్దిష్ట వయస్సు తర్వాత నెలవారీ ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో పారదర్శకత, బాధ్యతను తీసుకొచ్చేలా చట్టం తీసుకొస్తామని పేర్కొన్నారు.

## బెంగాల్‌లో కాంగ్రెస్ బిగ్ బ్యాంగ్

***నేషనల్ డెస్క్* :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ భారీ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మొత్తం 294 స్థానాలకు పోటీ చేయాలని నిర్ణయించిన పార్టీ, తొలి దశలోనే 284 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌధురి బహరంపూర్ నుంచి బరిలోకి దిగుతుండగా, తాజాగా పార్టీలో చేరిన మాజీ టీఎంసీ ఎంపీ మౌసమ్ నూర్‌కు మాలతిపూర్ నుంచి పోటీ చేయనున్నారు. అదే విధంగా మాధబ్ రాయ్ డార్జిలింగ్ నుంచి, అబ్దుల్ హన్నాన్ సుజాపూర్ నుంచి, సుస్మితా బిశ్వాస్ డమ్ డమ్ నుంచి, గౌతమ్ భట్టాచార్య డైమండ్ హార్బర్ నుంచి, సౌవిక్ ముఖర్జీ అసన్సోల్ దక్షిణ నుంచి, ప్రసెన్జిత్ పుయ్తాండి అసన్సోల్ ఉత్తర్ నుంచి పోటీ చేయనున్నారు. అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చలు జరిపిన తర్వాత ఈ జాబితా ఖరారు చేశారు. పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, అలాగే కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అంబికా సోని, మధుసూదన్ మిస్త్రీ, సల్మాన్ ఖుర్షీద్, టి ఎస్ సింగ్‌దేవ్, కె జె జార్జ్, పి ఎల్ పునియా, అమి యాజ్ఞిక్ వంటి కీలక సభ్యులు కూడా పాల్గొన్నారు. ఈసారి బెంగాల్‌లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. ఒక్క సీటు కూడా వదలకుండా మొత్తం 294 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని పార్టీ ప్రకటించింది. పార్టీ ఇన్‌చార్జి గులామ్ అహ్మద్ మీర్.. వెల్లడించిన ప్రకారం, మొత్తం 294 స్థానాలకు సుమారు 2500 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి అభ్యర్థులను ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. ఏప్రిల్ 23 మరియు 29 తేదీల్లో పోలింగ్ జరుగుతుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈసారి బెంగాల్‌లో పూర్తి స్థాయి పోటీకి సిద్ధమవుతూ రాజకీయంగా బలమైన సందేశం ఇచ్చినట్టైంది.

# కన్నవారికి అండగా ఉండేందుకు కొత్త చట్టం

(మొదటి పేజీ తరువాయి)
ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఉద్యోగులు తమ తల్లిదండ్రులను సంరక్షించకపోతే వారి వేతనం నుంచి ఒక భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు అందించే విధానం అమల్లోకి రానుంది. పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారన్న రేవంత్ రెడ్డి, పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చామని అన్నారు. మన దేశంలో బాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, జువైనల్ చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం ఇలా ఎన్నో చట్టాలు తెచ్చామని, వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించకుండా ఇవ్వాలని ఉందని, కేంద్ర చట్టం ప్రకారం రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రధాన ఆలయాలు , పుష్కర ఘాట్ల అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. 2027 జూన్‌లో గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీని నియమించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి 15 లేదా 20 రోజుల్లోగా నివేదికను అధికారుల కమిటీకి అందజేయాలని ఆదేశించారు. ఇంజినీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి, పూర్తి అంచనాలతో నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి పంపాలని సీఎం తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం తరువాత ప్రణాళికలకు సంబంధించిన నివేదికపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేసేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం తలెత్తకుండా ప్రజా భవన్ లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల్లో ఘాట్ల విస్తరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ చర్యలను మేనకా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి, అధికారులు వివరించారు. మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు అధికారులు. గోసంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు రూపొందించిందని మేనకా బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీపంలో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు రేవంత్. ఈ సందర్భంగా జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వ చర్యలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ కృషిని ప్రశంసిస్తూ అధికారులు, సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు.

## సౌదీలో అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్ దాడి

**తెహ్రాన్ / రియాద్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. సౌదీ అరేబియాలోని అమెరికా ఎయిర్‌బేస్‌పై తాము దాడి చేసి కీలక సైనిక విమానాన్ని దెబ్బతీశామని ఇరాన్ ప్రకటించింది. ప్రతిదాడిగా జరిపిన ఈ చర్యలో క్షిపణులు, డ్రోన్లు వినియోగించినట్లు తెలిపింది. సౌదీలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిందని ఇరాన్ మీడియా వెల్లడించింది. అక్కడ ఉన్న కమాండ్, కంట్రోల్ విమానం తీవ్రంగా దెబ్బతిన్నట్లు పేర్కొంది. విడుదలైన చిత్రాల్లో విమానం భాగాలు ధ్వంసమైనట్లు కనిపిస్తున్నాయని తెలిపింది. ఈ దాడిలో ఆరు బాలిస్టిక్ క్షిపణులు, ఇరవై తొమ్మిది డ్రోన్లు వినియోగించినట్లు సమాచారం. ఎయిర్‌బేస్‌లో ఉన్న పలు సైనిక వనరులు లక్ష్యంగా మారినట్లు వెల్లడించారు. అమెరికా సైనికులకు గాయాలైనట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పలు ఇంధన నింపే విమానాలు కూడా దెబ్బతిన్నాయని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దాడి తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. ఇరాన్ విప్లవ గార్డు దళాలు దీర్ఘశ్రేణి, మధ్యశ్రేణి క్షిపణులతో పాటు డ్రోన్లను ఉపయోగించాయని పేర్కొంది. అదనంగా ఒక అమెరికా డ్రోన్‌ను కూల్చివేశామని, యుద్ధవిమానాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నామని తెలిపింది. ఈ యుద్ధం రెండో నెలలోకి ప్రవేశించడంతో దాడులు మరింత విస్తరిస్తున్నాయి. సౌదీతో పాటు ఇతర ప్రాంతాలకూ ఉద్రిక్తతలు వ్యాపిస్తున్నాయి. యెమెన్ హూతీ తిరుగుబాటుదారులు కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. ఇరాన్ అకాడమిక్ సంస్థలపై దాడులకు ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన లక్ష్యాలపై మరిన్ని దాడులు చేస్తామని హెచ్చరించింది. యుద్ధ ప్రభావం పౌర ప్రాంతాలపై కూడా పడుతోంది. ఇరాన్‌లో పలు ప్రాంతాల్లో పేలుళ్లు చోటుచేసుకుని ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. నివాస ప్రాంతాల్లో కూడా దాడులు జరగడంతో భయాందోళనలు నెలకొన్నాయి. నీటి వనరులు, ఇతర మౌలిక సదుపాయాలు కూడా దెబ్బతిన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. కుటుంబాలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు నమోదవుతున్నాయి. ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌కు చెందిన రాడార్ కేంద్రాలు, ఇంధన నిల్వలు వంటి లక్ష్యాలను కూడా దాడి చేసినట్లు ప్రకటించింది. హైఫా ప్రాంతంలోని సైనిక కేంద్రాలు, విమానాశ్రయ ప్రాంతాలు లక్ష్యంగా మారినట్లు పేర్కొంది. పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్రమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పరస్పర దాడులు పెరుగుతుండటంతో ప్రాంతీయ స్థిరత్వంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందన్న అభిప్రాయం బలపడుతోంది.





## టిడిపి పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా

- ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు
- టిడిపి పార్టీ జెండా ఆవిష్కరించిన
- ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా మహానేత ఎన్టీఆర్ మహోన్నత సంకల్పంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ.విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా అభివృద్ధి దిశగా దూసుకెళ్తూ..44 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా.నందికొట్కూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో నందికొట్కూరు శాసన సభ్యులు గిత్త జయసూర్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య,సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి,టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు 6 మండలాల నాయకులు మండల కన్వీనర్లు బూత్ ఇన్చార్జిలు,క్లస్టర్ ఇంచార్జ్ లు,కార్యకర్తలు, మహిళ నాయకురాలు,తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎందరో త్యాగదనుల ఫలితంగానే స్వతంత్రం

- పటాన్ చెరు ఏరియా డివైఎఫ్ఐ కన్వీనర్ హరినాథ్ రెడ్డి
- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ఎందరో త్యాగదనుల ఫలితంగానే భారత దేశానికి స్వతంత్రం వచ్చిందని పటాన్ చెరు ఏరియా డివైఎఫ్ఐ కన్వీనర్ హరినాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్ లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పటాన్ చెరు ఏరియా డివైఎఫ్ఐ కన్వీనర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ..భగత్ సింగ్ లాంటి ఆలోచన కలిగి ఉండాలని, ఆయన స్వతంత్రం కోసం పోరాడిన వ్యక్తి అని ఆయన అన్నారు. దేశం గురించి కూడా విద్యార్థులు, యువతి యువకులు ఆలోచించాలని అన్నారు. దేశానికి స్వతంత్రం ఊరికనే రాలేదని, ఎంతోమంది త్యాగాల ఫలితంగానే స్వతంత్రం వచ్చిందని తెలిపారు. దేశం కోసం బ్రిటిష్ వాళ్ళు ఎదురించి నిలబడ్డ గొప్ప దేశ భక్తుడని సందర్భంగా కొనియాడారు. వచ్చిన స్వాతంత్రాన్ని మనమంతా రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ నివాసంలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

- రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
- డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి ఆధ్వర్యంలో
- టిడిపి జెండా ఆవిష్కరణ



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు పట్టణంలోని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి నివాసంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి సీనియర్ నాయకులు బంగారు వెంకటేశ్వర్లు, సుకూర్ మియా, లను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,ముజుబుర్ రెహమాన్, మాబు,కుమార్ ఇబ్రహీం,శ్రీనివాసులు, రాముడు తెలుగు యువత నాయకులు షాకీర్,జయకృష్ణ,జానూ,విద్యార్థి నాయకులు నాగరాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి


**ఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి నాగరాజు డిమాండ్**

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నంద్యాల జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అక్రమ అడ్మిషన్లు అరికట్టాలని ప్రభుత్వాన్ని సంబంధిత అధికారులను ఏవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి నాగరాజు డిమాండ్ చేశారు.ఆదివారం నాడు నందికొట్కూరు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి నాగరాజు మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలైన మరియు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు 2026 27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని అన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో పిఆర్ఓ లను,ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.ముందస్తు అడ్మిషన్లు అరికట్టలేని పక్షాన ఏవీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాలతో విద్యార్థులను సమకూర్చుకొని ఉద్యమాల ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వంశీ, వాసిమ్,మధు,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# రాజ్యాధికారమే బీసీల లక్ష్యం కావాలి

- ఏప్రిల్ 4న బీసీ ఆత్మగర్జన సభ
- బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు,ఆర్.జి.వి మీడియా చైర్మన్ ఐతగోని రాఘవేంద్ర గౌడ్



**మహబూబాబాద్,దీక్ష ప్రభ:** రాజ్యాధికారమే బీసీల లక్ష్యంగా ఏప్రిల్ 4న హైదరాబాదు లోని 'హలో బిసి చలో ఎల్బీనగర్' లోని చింతలకుంటలో నిర్వహించే 'బీసీ ఆత్మ గర్జన మహాసభ' ను దిగ్విజయం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, ఆర్జీవి మీడియా చైర్మన్ ఐతగోని రాఘవేంద్ర గౌడ్ (రాఘవన్న) పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాదు లోని ఆర్.జి.వి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 7 దశాబ్దాలు దాటిన బీసీలు ఇంకా వెనుకబడిన వర్గాలుగా మిగిలిపోయాయరని, పార్టీలు ఎన్ని మారిన బీసీల తలరాతలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 4న నిర్వహించే రాజ్యాధికారవేదిక ఆధ్వర్యంలో ఆర్జీవి మీడియా సౌజన్యంతో నిర్వహిస్తున్న బీసీ ఆత్మ గర్జన మహాసభ ను తెలంగాణ నలుమూలల నుంచి భారీ ఎత్తున బీసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాటి నుంచి నేటి వరకు అగ్రవర్ణాల చేతిలో బీసీలు అణచివేతకు గురి అయ్యారని, ఓట్లు మనవి అధికారం వాళ్లది అన్న చందంగా బీసీల జీవితాలు ఇంకా కొనసాగుతుండడం శోచనీయమన్నారు. బీసీల బతుకులు మారాలన్నా, బీసీల బిడ్డలకు ఉద్యోగాలు రావాలన్నా, రాజకీయంగా బీసీల వాటా మనకు దక్కాలన్నా,ఆర్థిక స్వావలంబన చేకూరాలన్నా, బీసీ రాజ్యం రావడమే ఏకైక మార్గమన్నారు. "పోరాడితే పోయేదేముందని, బీసీ రాజ్యం రావడం తప్పా" అనేనినాదం తో బీసీలమంతా కదం తొక్కి జంగ్ సైరన్ మోగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీసీల హక్కులసాధన కోసం బీసీ రాజ్యాధికార వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ ఆత్మ గర్జన మహాసభ లో విద్యార్థులు, మేధావులు,కార్మికులు,కర్షకులు, ఉద్యోగులు,మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీల 12 ప్రధాన డిమాండ్లను ప్రకటించారు. జనాభా దామాషా పద్ధతి ప్రకారం బీసీలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి, స్థానిక సంస్థలతోపాటు శాసనసభ, పార్లమెంట్ లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి, బీసీ సబ్ ప్లాన్ ను తక్షణమే అమలు చేయాలి, బీసీ కార్పొరేషన్లకు అధిక నిధులు కేటాయించాలి, విద్యా, ఉద్యోగాల్లో తక్షణమే రిజర్వేషన్ లు అమలు చేయాలి,కార్పొరేట్ తరహాలో బీసీ బిడ్డలకు విద్యా, వైద్యాన్ని ఉచితంగా అందజేయాలి, బీసీ కుల గణన చేపట్టాలి, ప్రైవేట్ పరిశ్రమలలో బీసీలకు ఉద్యోగాలు కల్పించాలి, గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కల్పించాలి,బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్ల లో 90 శాతం సబ్సిడీపై లోన్లు ఇవ్వాలి,ఆర్థిక,రాజకీయ, సాంస్కృతిక, సమాచార రంగాల్లో తగిన వాటా ఇవ్వాలి, బీసీ రైతుల సాగు పంటలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించుటకు బీసీల రాజ్యాధికారమే ధ్యేయంగా బీసీ ఆత్మగర్జన సభ పోరాడుతుందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైఆర్ టివి అధినేత రంజిత్ రెడ్డి,శ్రీనివాస్,మహేష్,రమేష్, నరేష్, వెంకన్న,విద్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

## సత్యమేవ జయతే

- మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి
- అసెంబ్లీలో తనపై నమోదు చేసిన అక్రమ మైనింగ్ కేసులపై మద్దతుగా మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపిన జీఎంఎస్ఆర్



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** అక్రమ మైనింగ్ పేరుతో తనపైన కేసులు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని రాష్ట్ర అసెంబ్లీలో కడిగి పారేసి, తనకు మద్దతుగా మాట్లాడిన రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుని శనివారం సాయంత్రం హైదరాబాదులోని ఆయన నివాసంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎంఎస్ఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు ఒక న్యాయం, అధికార పక్షానికి మరో న్యాయం అందిస్తూ ద్వంద వైఖరిని అవలంబిస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున పటాన్ చెరు నియోజకవర్గ నుండి ఎమ్మెల్యే జీఎంఆర్ హ్యాట్రిక్ విజయాన్ని జీర్ణించుకోలేని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ అక్రమంగా కేసులు బనాయిస్తూ మానసిక వేదనకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం నిప్పులాంటిదని, ఏదో ఒక రోజు నిజం బయటపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్ చెరు ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి, బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే జీఎంఆర్ నాయకత్వానికి పట్టం కట్టినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. తమ కుటుంబానికి సంపూర్ణ మద్దతు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం

- డ్వాక్రా మహిళలకు పరీక్ష నిర్వహించిన ఏపీఎం భాస్కర్
- పాల్గొన్న కోటగిరి ఎంఈఓ శ్రీనివాస రావు,కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్



**కోటగిరి,దీక్ష ప్రభ:** ఉమ్మడి కోటగిరి మండలంలోని కోటగిరి, ఎత్తోండ, ఎక్లాస్పూర్, కొత్తపల్లి, లింగాపూర్, రాంపూర్, సుద్దులం, వల్లభాపూర్, యాద్గార్ పూర్, హంగర్గా ఫారం, కల్లూరు, కొడిచర్ల, పోతంగల్, సోంపూర్, జల్లపల్లి గ్రామాలలో అమ్మకు అక్షరమాల పేరుతో మహిళా సంఘం సభ్యులందరికీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా మండలంలో మొదటి విడతగా మొత్తం 1367 సభ్యులకు గాను 1227 మహిళలకు అక్షర వికాసం పుస్తకం సహాయంతో తెలుగు రాయడం చదవడం అంకెలు గుర్తించడం కొరకు అందులో నుండి 55 శాతం సభ్యులకు పరీక్ష కొరకు ప్రశ్న పత్రం ఇచ్చి పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఏపీఎం భాస్కర్ తెలిపారు. ప్రతి మహిళ కనీస అక్షరజ్ఞానం కలిగి ఉండాలని, మహిళలను నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ కోటగిరి శ్రీనివాస రావు,కోటగిరి సర్పంచ్ మధుకర్,ఆయా గ్రామాల సర్పంచులు,ఏపీఎం భాస్కర్,సిసిలు సాయి బాబు,సాయి బాబా,నాగ రాజు,నాగ లక్ష్మి,సుజాత, రమేష్,ఎంఎస్ఏ రాజు,వివోఏలు పాల్గొన్నారు.



## రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రామేశ్వరంబండ జిహెచ్ఎంసి ఇంద్రపురి కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రామేశ్వరంబండ పరిధిలోని ఇంద్రపురి కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రామేశ్వరంబండ పరిధిలోని నాలుగు వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు భారీ విజయాన్ని అందించడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి హామీ నెరవేర్చేందుకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయించడంతోపాటు నిర్దేశించిన లక్ష్యంలోగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రమీల, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి,కౌన్సిలర్లు అంతిరెడ్డి, రమేష్, వంకదోత్ రమేష్, మాజీ ప్రజా ప్రతినిధులు,కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొన్నారు.





## కల్లూరులో కుక్కల స్వైర విహారం

**తెల్లవారుజామున పలువురుపై దాడి చేసిన కుక్కలు**
**మహిళలు చిన్నపిల్లలకు తీవ్ర గాయాలు**

**పోతంగల్,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఊర కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఒక్కసారిగా విరుచుకుపడిన కుక్కల దాడిలో ఇద్దరు మహిళలతో పాటు పదేళ్ల బాలుడు , 32 ఏళ్ల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.అనంతరం కుక్కలు పశువులపై సైతం దాడి చేయడంతో పశువులకు తీవ్ర గాయాలయ్యాయి.ఈ ఘటనతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గ్రామంలో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, బయటకు రావాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి,కుక్కల నుండి తమకు రక్షణ కల్పించాలని కల్లూరు గ్రామస్తులు వివిజ్ఞప్తి చేస్తున్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** మండలంలోని గోల్ బొడ్కా తండా జిపి పరిధిలోని పూసల తండాలో ఆదివారం ఈజీఎస్ ద్వారా మంజూరైన సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ భూక్యా వీరు నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో ప్రతి తండాకు సిసి రోడ్లు వేసి, తండాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నరేష్, వార్డ్ సభ్యులు బికు,గ్రామస్తులు బాధవత్ లక్ష్మ, రావుజీ,రాంజీ,నర్సింహా,భద్రు, జీపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుడిచెర్ల గ్రామంలో బండలాగుడు పోటీలు ప్రారంభం

- ప్రత్యేక పూజ కార్యక్రమంలో
- ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా మండలం తుడిచర్ల గ్రామంలో శ్రీరామనవమి పురస్కరించుకొని రాముల వారి గుడిలో పూజా కార్యక్రమంలో పాల్గొని మరియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్ర స్థాయి ఆరు పండ్ల ఎద్దుల పందెములును అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే గిత్త జయ సూర్య ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాల మదిలేటి, ఎంపీటీసీ సుధాకర్,పద్మనాభయ్య,రాముడు, గిరీశ్వర్ రెడ్డి,పిక్కిలి శ్రీనివాసులు, రవికుమార్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, గ్రామ మండల నాయకులు పాల్గొనడం జరిగింది.



దీక్ష ప్రభ
30-03-2026
సోమవారం
హైదరాబాద్
deekshaprabhadaily.com



# వడ్డేమాన్ సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం

- మట్టలతో భారీగా క్రైస్తవ సోదరులు
- ప్రసంగించిన రెవరెండ్ విజయ్ కుమార్

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** ప్రపంచం వ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడే కు ముందు వచ్చే ఆదివారాన్ని ఫామ్ సండే లేదా మట్టల ఆదివారంగా క్రైస్తవ సోదరులు జరుపుకుంటారని గార్గేయపురం ఫాస్టేట్ చైర్మన్ రెవరెండ్ విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలో వడ్డెమాన్ గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గార్గేయపురం ఫాస్టేట్ చైర్మన్ రెవరెండ్ విజయ్ కుమార్ ప్రసంగిస్తూ ఆదివారానికి ముందు వచ్చే యేసు ప్రభువు యెరుషలేములోకి గాడిద మీద ప్రవేశించిన రోజున యెరుషలేము ప్రజలు దారి పొడుగునా ఖర్జూర మట్టలు,ఈత మట్టలు ,బట్టలు పరచిరి,దావీదు కుమారునికి జయము హోసన్నా.. హోసన్నా అని కేకలు వేస్తు యెరుషలేములోకి ప్రవేశించినారు .ఆ రోజును పురస్కరించుకుని ఈనాడు క్రైస్తవులు మందిరాలలో ఆరాధన అనంతరం ఈత మట్టలు చేత పట్టుకొని ఆలయం చుట్టు తిరుగుతు దావీదు కుమారునికి జయము హోసన్న ప్రభు పేరట వచ్చేవాడు స్తుతింపబడును గాక అని నినాదాలు చేస్తారు.ఇపందుగను యేసుక్రీస్తు వారు సిలువకు అప్పగించడానికి ముందు యెరుషలేములో జరిగిన ఒక( లేఖనాల నెరవేర్పు)సంఘటన, ఈనాడు క్రైస్తవులు గుడ్ ఫ్రైడే కి ముందు ఆదివారాన్ని మట్టలా ఆదివారంగా ఆరాధనలు జరుపుతు ఆచరిస్తున్నారు.ఈ ప్రార్థనలో సంఘ కాపరి పబ్బతి సంజన్న సీఎస్ఐ సంఘస్తులు,స్త్రీల మైత్రి వారు,యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలి

## పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** పటాన్ చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని మండే మార్కెట్ వద్ద కబడ్డీ క్రీడాకారుడు పండు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి మ్యాట్ కబడ్డీ పోటీలను శనివారం సాయంత్రం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలని విజ్ఞప్తి చేశారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడా పోటీలు ఏర్పాటు ఏర్పాటు చేసిన నిర్వాహకుడు పండును అభినందించారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శ్రీనివాస్ రెడ్డి,కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్లయ్య,జానీ, క్రీడాకారులు పాల్గొన్నారు.




Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com